క్లుప్తంగా

విద్యార్థులకు బాలవిహార్ శిక్షణ తరగతులు



శ్రీగిరిలో బాల విహార్ శిక్షణ తరగతుల్లో నిమగ్నమైన విద్యార్థులు

ఒంగోలు మెట్రో: ఒంగోలు కొండమీద శ్రీ గిరి వెంకటేశ్వర స్వామి దేవస్థానం, చిన్మయ మిషన్ సంయుక్తంగా శ్రీగిరి గో క్షేత్ర భవనంలో రెండు నెలలుగా ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న బాల విహార్ శిక్షణ తరగతులు ఉత్సాహంగా సాగుతున్నాయి. విద్యార్థుల్లో శక్తి సామర్థ్యాలను వెలికి తీసేలా వివిధ అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. ఆదివారం శిక్షణ తరగతులను శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝూన్సీ రాణి, ధర్మకర్తల మండలి ప్రతినిధులు, చిన్మయ మిషన్ ప్రబోధకులు పర్యవేక్షించారు.

అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు



ఈతముక్కల దుకాణంలో దీపావళి మందులు తనిఖీ చేస్తున్న ఎస్సై సుధాకర్‌బాబు

కొత్తపట్నం: అనుమతులు లేకుండా దీపావళి బాణసంచా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్సై వేమూల సుధాకర్‌బాబు అన్నారు. మండలంలో ఈతముక్కల, మడనూరు, కొత్తపట్నం గ్రామాల్లో ఆదివారం పర్యటించి దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ దీపావళి మందులు విక్రయించేవారు ముందుగా అనుమతులు తీసుకుని షాపులు పెట్టాలని కోరారు. గ్రామానికి దూరంగా షాపులు ఏర్పాటు చేయాలని, ప్రజలకు ఎటువంటి ఆటంకం లేకుండా పెట్టుకోవాలని సూచించారు. తెచ్చుకున్న స్టాక్‌ను దూర ప్రాంతాల్లో భద్రపరుచుకోవాలని తెలిపారు.

చీమకుర్తిలో ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది వేడుకలు



మాట్లాడుతున్న డాక్టర్ జవహర్

చీమకుర్తి: ఆర్‌ఎస్‌ఎస్ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం చీమకుర్తిలోని పద్మశాలీయుల కల్యాణ మండలపంలో శతాబ్ది వేడుకల కార్యక్రమం నిర్వహించారు. లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు డాక్టర్ బీ జవహర్ ముఖ్య అతిథిగా హాజరై ఆర్‌ఎస్‌ఎస్ ప్రాధాన్యతను వివరించారు. ఆర్‌ఎస్‌ఎస్ మద్దతుదారులు, సానుభూతిపరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలతో ప్రజలకు నష్టం

- బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమంలో మాజీ మంత్రి మేరుగు నాగార్జున



చంద్రబాబు మోసాలపై క్యూఆర్ కోడ్ విడుదల చేస్తున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున, వైఎస్సార్ సీపీ నాయకులు

నాగులుప్పలపాడు: సీఎం చంద్రబాబు మాయమాటలు, అబద్ధపు హామీలను నమ్మి రాష్ట్ర ప్రజలు నిలువునా ఆగమైపోయారని వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి మేరుగు నాగార్జున విమర్శించారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీలో భాగంగా ఆదివారం నాగులుప్పలపాడు మండలంలోని చదలవాడ, అమ్మనబ్రోలు గ్రామాలలో నిర్వహించిన కార్యక్రమాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలను కూటమి ప్రభుత్వ నాయకులు నిలువునా మోసం చేస్తున్నారన్నారు. ప్రతి పనికీ దోచుకోవడం, దాచుకోవడం రీతిన పనులు చేస్తున్న టీడీపీ నాయకులు రాష్ట్రాన్ని అవినీతిమయం చేస్తున్నారన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పథకాలను, పనులను అర్హతే ప్రామాణికంగా అందించగా, ప్రస్తుతం సిఫార్సులు, పైరవీలు లేకుండా ఒక్క పని కూడా జరగడం లేదన్నారు. చంద్రబాబు నిరంకుశ పాలనకు రాష్ట్ర ప్రజలు చరమగీతం పాడే రోజు కోసం అందరూ సంఘటితమై కూటమి పాలకులకు తరిమికొట్టాలని మేరుగు నాగార్జున పిలుపునిచ్చారు. అనంతరం బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్ వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు.

కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు నలమలపు కృష్ణారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి కంచర్ల సుధాకర్, దివ్యాంగుల విభాగం రాష్ట్ర కార్యదర్శి కాట్రగడ్డ శ్రీనివాసరావు, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాలడుగు రాజీవ్, గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు పోలినేని కోటేశ్వరరావు, మండల యూత్ అధ్యక్షుడు ఇమ్మిశెట్టి బాలకృష్ణ, బీసీ సెల్ మండలాధ్యక్షుడు పాదర్తి శివ, కోయి హనుమయ్య, కట్టా రాజా, కోటిరెడ్డి, రామస్వామి, కోడె సుబ్బయ్య, తోకల శ్రీనివాసరావు, కాటూరి ఆదియ్య, అత్తి, పోలినేని వెంకట్రావు పాల్గొన్నారు.

గ్రామ కమిటీల ఎంపిక...

వైఎస్సార్ సీపీ అమ్మనబ్రోలు, చదలవాడ గ్రామాలకు నూతన కమిటీలను మేరుగు నాగార్జున ఆధ్వర్యంలో నియమించారు. అమ్మనబ్రోలు గ్రామాధ్యక్షునిగా కట్టా రాజా, ఉపాధ్యక్షులుగా పఠాన్ రహంతుల్లా, తోటపల్లి లక్ష్మణ, ప్రధాన కార్యదర్శిగా పాతెం శ్రీను, షేక్ బాజీతో పాటు మరో 12 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అదేవిధంగా చదలవాడ గ్రామాధ్యక్షునిగా తోకల శ్రీనివాసరావును ఎంపిక చేశారు.

వెల్లువెత్తిన నిరసన



ఎండ్లూరులో నిరసన వ్యక్తం చేస్తున్న మాలమహానాడు సంతనూతలపాడు మండల నాయకులు

- అంబేడ్కర్ విగ్రహాన్ని దహనం చేయడంపై పలు ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు
- నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

సంతనూతలపాడు: చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలంలోని దేవళంకోట గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని దహనం చేయడంపై సంతనూతలపాడు నియోజకవర్గంలోని మండలాల్లో ఆదివారం నిరసనలు వెల్లువెత్తాయి. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మాలమహానాడు సంతనూతలపాడు మండల నాయకులు ఆదివారం మండలంలోని ఎండ్లూరు గ్రామం అరుంధతీనగర్‌లో అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల ప్రాంగణంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహానికి నిప్పుపెట్టి దహనం చేయడం దారుణమని అన్నారు. ముందుముందు ఇటువంటి చర్యలకు ఎవరూ పాల్పడకుండా ఉండాలంటే.. దేవళంకోట ఘటనలో నిందితులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాలమహానాడు మండల నాయకులు ఇస్తర్ల శ్రీనివాసరావు, సంకె సుబ్బారావు, కారుమంచి నాగరాజు, మార్పుడి రమేష్, మార్పుడి రమణయ్య, చావబత్తిన రాంబాబు, కె.కోటేశ్వరరావు, దాసరి ప్రకాశం, సాదు కొండలరావు, అన్నవరపు పూర్ణచంద్రరావు, గొర్రెముచ్చు చేజర్లయ్య, బొంతా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో నల్ల రిబ్బన్లతో ప్రజాసంఘాలు ఆందోళన...

చీమకుర్తి: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రజాసంఘాల నాయకులు ఆదివారం నల్ల రిబ్బన్లతో ఆందోళన వ్యక్తం చేశారు. చిత్తూరు జిల్లా దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన వ్యక్తులను తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. నిప్పు పెట్టడం కారణంగా కాలిన విగ్రహం స్థానంలో నూతన విగ్రహం ఏర్పాటు చేయడంతో పాటు నిప్పు పెట్టిన దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా కళామండలి రాష్ట్ర కార్యదర్శి జంగాల కోటి, జేఏసీ అధ్యక్షుడు బండ్ల కొండలు, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ సోమా శేషాద్రి, ఎంఆర్‌పీఎస్ నాయకులు తొరటి ఆనంద్, కేఎన్‌పీఎస్, కేవీపీఎస్ నాయకులు ఆర్.రాంబాబు, తొట్టెంపూడి రాంబాబు, పేరం శ్రీనివాసరావు, పిన్నిక శ్రీనివాసరావు, చింతలపాలెం బాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అమ్మనబ్రోలు గ్రామంలో...

నాగులుప్పలపాడు: అంబేడ్కర్ విగ్రహాన్ని పెట్రోల్ పోసి తగలబెట్టడాన్ని నిరసిస్తూ ఆదివారం మండలంలోని అమ్మనబ్రోలు గ్రామంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జుజ్జూరి జయంతిబాబు మాట్లాడుతూ మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భారత రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడిందన్నారు. దేశ వ్యాప్తంగా దళితులపై దాడులు పెరిగాయన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌తో పాటు మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ వంటి స్వాతంత్ర్య సమరయోధులను అవమానించడం బాధాకరమన్నారు. అసాంఘిక శక్తులు చెలరేగిపోతున్నాయని, వారిని ప్రజలంతా అడ్డుకోకపోతే రాజ్యాంగానికే ప్రమాదం ఏర్పడుతుందని అన్నారు. కార్యక్రమంలో కొట్టే ప్రసన్న, కె.వెంకటకృష్ణ, మైనంపాటి సుందరయ్య, స్టాలిన్, బండి రాజారావు, సుధీర్, ఆలూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



చీమకుర్తిలో నల్ల రిబ్బన్లతో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు



అమ్మనబ్రోలులో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

7న చలో విజయవాడను విజయవంతం చేయాలి



చలో విజయవాడ ధర్నా కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఫ్యాప్టో నాయకులు

ఒంగోలు సిటీ: విజయవాడలోని ధర్నా చౌక్‌లో ఈ నెల 7వ తేదీ ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం ఒంగోలులోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఫ్యాప్టో ఒంగోలు డివిజన్ సన్నాహక సమావేశం నిర్వహించగా షేక్ అబ్దుల్ హై అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో నాయకులు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఉపాధ్యాయ లోకానికి పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి ఉపాధ్యాయుల బోధనేతర, ఆర్థిక విషయాల మీద ఒక స్పష్టమైన రూట్ మ్యాప్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యలను పరిష్కరించి విద్యా శాఖలో ఉన్న అసంబద్ధతను తొలగించాలని, జీవో నంబర్లు 72, 73, 74 అమలు చేయాలని కోరారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, 2004 సెప్టెంబర్ ఒకటో తేదీ ముందు విడుదలైన నోటిఫికేషన్ ద్వారా నియామకమైన వారందరికీ కేంద్ర ప్రభుత్వ మెమో నంబర్ 57 అమలు చేసి పాత పెన్షన్ విధానంలోకి తీసుకురావాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇంకా మొదలగు డిమాండ్లతో 7వ తేదీ ఉదయం 10 గంటలకు విజయవాడ ధర్నా చౌక్ సెంటర్లో చేపట్టిన ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిస్తూ కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర బాధ్యులు చల్లా శ్రీను, ఏపీటీఎఫ్ 257 జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసులు, హెచ్‌ఎంల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వై.వెంకట్రావు, యూటీఎఫ్ జిల్లా ట్రెజరర్ ఎస్.చిన్నస్వామి, జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్.రవి, సీహెచ్ ప్రభాకర్‌రెడ్డి, ఏపీపీఎఫ్ 1938 రాష్ట్ర నాయకులు పి.బి.సుబ్బారావు, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు యు.వెంకట్రావు, జేవీవీ రాష్ట్ర నాయకుడు భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి

ఒంగోలు మెట్రో: విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని జిల్లా కేంద్ర గ్రంథాలయం ఒంగోలు ఇన్‌చార్జి డిప్యూటీ లైబ్రేరియన్ సంపూర్ణ కాళహస్తి అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం ఉదయం 'చదవడం మాకిష్టం' కార్యక్రమం నిర్వహించారు. బేబీ మేడం బహుమతిగా ఇచ్చిన 60 నీట్ పుస్తకాలతో బుక్ షో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బుక్ రీడింగ్ క్లబ్ సభ్యులు సీహెచ్ కోటేశ్వరరావు, లైబ్రరీ అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ మధురశ్రీ, నాగేశ్వరరావు, డీసీఎల్ సిబ్బంది డి.సందీప్, గోవిందమ్మ పాల్గొన్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు.



జిల్లా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమంలో చిన్నారులు

ప్రజలను వేధిస్తే కఠిన చర్యలు



హిజ్రాలకు కౌన్సిలింగ్ ఇస్తున్న పోలీసులు

- హిజ్రాలకు పోలీసుల వార్నింగ్

ఒంగోలు టౌన్: జాతీయ రహదారులపై, నగరంలోని ప్రధాన కూడళ్లలో, షాపుల వద్ద బలవంతంగా డబ్బు వసూలు చేస్తూ ప్రజలను వేధిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హిజ్రాలకు పోలీసులు వార్నింగ్ ఇచ్చారు. ఆదివారం నగరంలోని ఇందిరమ్మ కాలనీ, ఇస్లాంపేట ప్రాంతాలలోని హిజ్రాలకు ప్రత్యేకంగా కౌన్సిలింగ్ నిర్వహించారు. రోడ్ల మీదకు వచ్చి వాహనాలను ఆపడం, ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం, దుకాణాలు, షోరూంల ప్రారంభోత్సవాలకు వెళ్లి బలవంతంగా డబ్బు వసూలు చేయడం చట్ట విరుద్ధమని చెప్పారు. డబ్బు కోసం ప్రజలను వేధించడం, భయపెట్టడం, బెదిరించడం వంటి చర్యలకు పాల్పడవద్దని హితవు పలికారు. రోడ్ల మీద వాహనాలను అడ్డుకోవడం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఇకపై వాహనాలను ఆపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని సమాజంలో గౌరవంగా బతికేందుకు ప్రయత్నించాలని సూచించారు. మహిళా పోలీసు స్టేషన్ సీఐ సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కౌన్సిలింగ్‌లో పలువురు పోలీసులు పాల్గొన్నారు.

టీడీపీ రియల్ ఎస్టేట్ మాఫియా అసత్య ఆరోపణలు

- జేసీ ప్రభాకరరెడ్డి వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి
- దళితుల భూమికి పెద్దిరెడ్డి ఎలా వారసుడు అవుతాడు
- దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నీలం నాగేంద్రరావు

ఒంగోలు వన్‌టౌన్: పేర్నమిట్ట సర్వే నంబర్ 148/2లో సుదర్శనానికి ఎటువంటి హక్కులు లేవని, ఈ అసత్య ఆరోపణల వెనుక టీడీపీ రియల్ ఎస్టేట్ మాఫియా ఉందని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు అన్నారు. ఒంగోలు ఎంసీపీ భవన్‌లో ఆదివారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేర్నమిట్ట సర్వే నంబర్ 148/2లోని ఎకరా 4 సెంట్ల రిజిస్టర్ భూమి తమదేనన్నారు. అనంతపురం జిల్లా తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జేసీ దివాకరరెడ్డి వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడుతున్నారన్నారు. చివుకుల గోపాలకృష్ణయ్యకు చివుకుల సుదర్శనంకు ఎటువంటి సంబంధం లేదన్నారు. పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి సంతనూతలపాడు సబ్ రిజిస్టార్ కార్యాలయం నుంచి తీసుకున్నవి సర్టిఫైడ్ కాపీలేగానీ, అసలు డాక్యుమెంట్లుగానీ, లింక్ డాక్యుమెంట్లుగానీ కాదన్నారు. అనవసరమైన వివాదాలు సృష్టించి లబ్ధిపొందాలని చూస్తున్నారన్నారు. లింగారెడ్డి అనే వ్యక్తి వద్ద నుంచి తన తాత నీలం రోశయ్య ఎకరా 80 సెంట్లను 1905లో కొనుగోలు చేశారన్నారు. 1930లో సివిల్ దావాలో తమ భూమి వేలానికి వచ్చిందని, అయితే ఆ వేలం అమలు కాలేదని తెలిపారు. మాల కులస్తుడైన తమ తాత నీలం రోశయ్యకు పెద్దిరెడ్డి సూర్యప్రకాశ్‌రెడ్డి ఎలా వారసుడవుతాడని నీలం నాగేంద్రరావు ప్రశ్నించారు. విలేకరుల సమావేశంలో దారా అంజయ్య, కాకుమాను రవి, నాసరయ్య, ఈశ్వర్ పాల్గొన్నారు.

గ్రానైట్ పరిశ్రమల సమ్మె విరమింపజేయాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సుబ్బారావు డిమాండ్



గ్రానైట్ పరిశ్రమలో కార్మికుల సమస్యలు తెలుసుకుంటున్న సీఐటీయూ నాయకులు

చీమకుర్తి రూరల్: కూటమి ప్రభుత్వానికి గ్రానైట్ పరిశ్రమల గోడు వినబడదా అని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వెంటనే గ్రానైట్ పరిశ్రమల యజమానులతో చర్చించి సమ్మెను విరమింపజేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని మర్రిచెట్లపాలెం పరిధిలోని పలు గ్రానైట్ పరిశ్రమలను సందర్శించి గ్రానైట్ కార్మికుల సమస్యలడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కరోనా కాలం నుంచి గ్రానైట్ పరిశ్రమలు సంక్షోభంలో కూరుకుపోయాయని అన్నారు. ఇప్పటికే అనేక గ్రానైట్ పరిశ్రమలు మూతపడ్డాయని, కార్మికులు రోడ్డున పడ్డారని, ఇటువంటి పరిస్థితులలో గ్రానైట్ పరిశ్రమలుంటే మూలిగే నక్కపై తాటికాయ పడినట్లయిందని అన్నారు. ప్రభుత్వానికి కట్టాల్సిన సీనరేజీ వసూలును ఏఎంఆర్ సంస్థకు అప్పగించడం వలన పెంచిన రాయల్టీకన్నా అనధికారికంగా అధికంగా వసూళ్లకు పాల్పడుతున్నారని అన్నారు. క్రాక్ ముడిరాయికి కూడా రాయల్టీ చెల్లించాలని గ్రానైట్ పరిశ్రమల యజమానులపై ఏఎంఆర్ సంస్థ ఒత్తిడి తేవడంతో అనేక గ్రానైట్ పరిశ్రమలు మూతపడతాయన్నారు. కూటమి ప్రభుత్వం జోక్యం చేసుకుని కార్మికులు రోడ్డున పడకుండా సమస్యకు పరిష్కారమార్గం చూపించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పి.ఆంజనేయులు, స్థానిక నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

మద్దిపాడు: మండలంలోని నేలటూరు గ్రామానికి చెందిన అన్నాబత్తిన నాగేశ్వరరావు (36) నేలటూరు గ్రామ సమీపంలోని చెరువు ప్రాంతంలో మోటార్ సైకిల్ పై వెళుతూ రోడ్డు పక్కన ఉన్న రాళ్లను ఢీకొట్టాడు. దీంతో అతడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 వాహనంలో అతనిని ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

వైభవంగా దుర్గమ్మ నగరోత్సవం



మహిషాసుర వధ నృత్య ప్రదర్శన

ఒంగోలు మెట్రో: ఒంగోలు మర్రిచెట్ల కాలనీ పొలిమేర అభయాంజనేయ స్వామి వారి వీధిలో మర్రిచెట్ల కాలనీ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 22 నుంచి శరన్నవరాత్రుల సందర్భంగా స్థానిక భక్తుల సహాయ సహకారాలతో దుర్గమ్మ మండపాన్ని ఏర్పాటు చేసి ప్రతిరోజు అమ్మవారి అలంకరణలు విశేష కుంకుమ పూజలు, పలు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై అమ్మవారిని ఉంచి బాజాభజంత్రీలతో నగరోత్సవం నిర్వహించారు. అమ్మవారి వేషధారణలో పాల్గొన్న మహిళలు నృత్యాలు చేశారు.